ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కర్నూలు
5
జిల్లా వార్తలు
సోమవారం 29 జనవరి 2024


బాబుకు నాగలి బహూకరణ


చంద్రబాబు సభకు అశేషంగా తరలి వచ్చిన జనాలు

ఇక మిగిలింది 73 రోజులే...!




ఈల వేస్తున్న అభిమాని

- జెండాలు పట్టి జనాల్లోకి వెళ్లండి
- జగన్‌ను ఇంటికి సాగనంపండి
- కర్నూలుకు హైకోర్టు బెంచ్ బాధ్యత నాది
- 'సూపర్ సిక్స్'తో పేదరికాన్ని నిర్మూలిస్తా
- పత్తికొండ బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

కర్నూలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి)/పత్తికొండ: 'జెండాలు పట్టండి.. జనాల్లోకి వెళ్లండి.. ఇక మిగిలింది 73 రోజులే.. రాబోయే ఎన్నికల కురుక్షేత్రానికి సిద్ధంగా ఉండండి.. వై నాట్ 175 అంటున్న జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపండి.. అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. పత్తికొండలో ఆదివారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ 73 రోజులు కష్టపడితే.. ఈ రాష్ట్రానికి పట్టిన సైకో జగన్ పీడ విరుగడవుతుందని, రాష్ట్ర భవిష్యత్తే మారిపోతుందని అన్నారు. పత్తికొండ సభను చూస్తే సైకో జగన్‌కు రాత్రి నిద్రపట్టదని, తాడేపల్లి ప్యాలెస్‌లో టీవీలు పగిలిపోతాయని అన్నారు. ప్రజల ఉత్సాహాన్ని చూస్తే టీడీపీ-జనసేన గెలుపును ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. 'ఉరవకొండ, పీలేరు సభల కంటే పత్తికొండ సభ దద్దరిల్లిందని, యువత బాధ, రైతు వ్యథ, వలస రైతుల ఆక్రందన, ఉద్యోగుల బాధలు, దగా పడ్డ యువత ఆక్రోశం మీలో కనిపిస్తోందని, మీకు భరోసా ఇస్తున్నా'.. కర్నూలు జిల్లాను బాగు చేసే బాధ్యత టీడీపీ-జనసేన ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. దీంతో జనాలు రెట్టింపు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు.

సూపర్ సిక్స్‌తో పేదరిక నిర్మూలన:

టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి పేదరికాన్ని నిర్మూలిస్తానని టీడీపీ అధినేత అన్నారు. ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అంత మందికీ మహాశక్తి కింద నెలకు రూ.1,500, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేల చొప్పున సాయం అందిస్తామని చెప్పారు. మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతోపాటు ఆర్టీసీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామని, యువగళం కింద లక్షల ఉద్యోగాల నియామకం కల్పిస్తాం స్పష్టం చేశారు. ఇంటింటికి సురక్షిత నీరందిస్తామని, బీసీలకు రక్షణ చట్టం తెస్తామని భరోసా ఇచ్చారు. జగన్ పాలనలో అధ్వానంగా మారిన రాష్ట్రాన్ని బాగు చేసే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు పునరుద్ఘాటించారు.



కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

గత ఎన్నికలకు ముందే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చానని చంద్రబాబు ఉద్ఘాటించారు. అందుకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. ఈ జగన్ వచ్చాక మూడు రాజధానుల పేరుతో దగా చేశాడని. టీడీపీ, జనసేన ప్రభుత్వం రాగానే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే బాధ్యత తీసుకుంటాననీ చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు.


ధమరుకంతో బాబు

పేరుపేరునా పలకరింపు

చంద్రబాబు హెలిప్యాడ్‌కు రాగానే టీడీపీ కార్యకర్తలు ఉవ్వెత్తున అక్కడికి చేరుకున్నారు. చంద్రబాబును చూసేందుకు పోటీ పడ్డారు. అక్కడి నుంచి వేదికపైకి చేరుకున్న చంద్రబాబు జిల్లా నాయకులను పేరుపేరునా పలకరించారు. నాయకులు అధినేత చంద్రబాబుకు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


చంద్రబాబుతో మాట్లాడుతున్న కోట్ల


వేదికపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు


ఎన్టీఆర్‌కు నివాళి


వేదికపై నంద్యాల ఇన్‌చార్జి ఫరూక్, జనసేన నాయకులు


వేదికపైకి వస్తున్న చంద్రబాబు


రాక్షస పాలనపై విల్లు ఎక్కుపెట్టిన చంద్రబాబు

8 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం

కర్నూలు, జనవరి 28: ఉమ్మడి కర్నూలు రేంజ్ పరిధిలో 8 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఆదివారం డీఐజీ సెంథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ పొందిన ఎస్‌ఐల వివరాలు... కర్నూలు తాలూకా పరిధిలో పని చేస్తున్న ఎస్.బాల నరసింహుడిని కోడుమూరుకు బదిలీ చేయగా అక్కడ పని చేస్తున్న ఏపీ శ్రీనివాసులును నాగులాపురానికి బదిలీ చేశారు. గోనెగండ్లలో పని చేస్తున్న తిమ్మారెడ్డిని సి.బెళగల్‌కు, బెళగల్ ఎస్‌ఐ జె.మన్మథ విజయ్‌ను కర్నూలు త్రీటౌన్‌కు, ఆదోని టూటౌన్‌లో పనిచేస్తున్న జి.పెద్దయ్య నాయుడును హొళగుందకు, హాలహర్వి ఎస్‌ఐ నాగేంద్రను ఆదోని త్రీటౌన్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా చిప్పగిరి ఎస్‌ఐ రమేష్‌బాబును మద్దికెరకు బదిలీ చేయగా అక్కడ పని చేస్తున్న ఎస్.మహ్మద్ రిజ్వాన్‌ను చిప్పగిరికి బదిలీ చేశారు. ఇక నంద్యాల వీఆర్‌లో ఉన్న ఎం.నగేష్, నరేంద్రలను ఉలిందకొండ, హాలహర్వి పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు.


ఇదే ఉత్సాహం కొనసాగాలి

- పత్తికొండ సభ సక్సెస్
- కష్టపడిన ప్రతి ఒక్కరిని గుర్తుంచుకుంటా
- టీడీపీ నాయకులతో అధినేత చంద్రబాబు

కర్నూలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'పత్తికొండ సభ సూపర్ సక్సెస్ చేశారు.. ఇదే స్ఫూర్తితో సమష్టిగా ఎన్నికల దాకా దృష్టి పెడితే విజయం మనదే. అందులో ఎలాంటి సందేహం లేదు..' అని టీడీపీ నేతలకు అధినేత చంద్రబాబు అన్నారు. 'రా.. కదలిరా సభ అనంతరం ఉమ్మడి జిల్లాల టీడీపీ అధ్యక్షులు బీటీ నాయుడు, మల్లెల రాజశేఖర్, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆయా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కేఈ శ్యాంబాబు, కోట్ల సుజాతమ్మ, కే.మీనాక్షి నాయుడు, గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, భూమా అఖిలప్రియ, టీజీ భరత్, బీవీ జయనాగేశ్వరరెడ్డి, తిక్కారెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, ధర్మవరం సుబ్బారెడ్డితోపాటు ముఖ్య నాయకులతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా



రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. బేషజాలకు వెళ్లకుండా సమష్టిగా పని చేయాలని సూచించారు. ప్రస్తుతం జనస్పందన చూస్తే రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాల్లో అన్ని స్థానాలు గెలిచే అవకాశాలున్నాయని, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకెళ్లాలని సూచించారు. 'రా..కదలిరా..' బహిరంగ సభను సూపర్ సక్సెస్ చేశారన్నారు. ఇప్పటి దాకా జరిగిన సభలతో పోలిస్తే పత్తికొండ సభ హైలెట్‌గా నిలిచిందన్నారు. అందుకోసం కృషి చేసిన ప్రతి ఒక్కరి కష్టాన్ని గుర్తు పెట్టుకుంటానని చంద్రబాబు నాయకులకు చెప్పారు. జిల్లాలో బాదుడే బాదుడు, ఇదేమి కర్మ మన రాష్ట్రానికి, యువగళం పాదయాత్ర కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని, పత్తికొండ సభను అదే స్థాయిలో సక్సెస్ చేసి రాష్ట్రంలో కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చారని జిల్లా నాయకులను చంద్రబాబు కొనియాడారు.



ఇది 'చెత్త' ప్రభుత్వం

చెత్తపైనా పన్ను వేశారు

ఒక్క పరిశ్రమను కూడా తేలేకపోయారు

టీడీపీ హయాంలోనే ప్రాజెక్టులకు పెద్దపీట

రా.. కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

కర్నూలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి)/పత్తికొండ: 'చెత్తపైన కూడా చెత్త వేసిన చెత్త ప్రభుత్వమిది.. ఒక్క పరిశ్రమను కూడా తేలేకపోయిన అసమర్థ పాలన జగన్‌ది. ప్రాజెక్టులకు పెద్దపీట వేసింది టీడీపీ హయాంలోనే' అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. పత్తికొండలో ఆదివారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభలో ఆయన ఉత్సాహంగా ప్రసంగించారు. గత టీడీపీ ప్రభుత్వంలో గుండ్రేవుల, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులకు రూ.8వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామని అన్నారు. జగన్ వచ్చాక ఒక్క ప్రాజెక్టునైనా కట్టాడా అంటూ నిలదీశారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి పత్తికొండను సస్యశ్యామలం చేయాలని పట్టుబట్టి హంద్రీనీవా నుంచి 68 చెరువులకు నీరు అందించేందుకు రూ.250 కోట్లు మంజూరు చేయించుకున్నారని గుర్తు చేశారు. 75 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నిర్మించామని, 33వేల ఎకరాలతో పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేశామని, సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టులు తీసుకువచ్చామని, సిమెంటు పరిశ్రమలు తెచ్చామని తెలిపారు. ఈ జగన్ వచ్చి ఏం చేశాడంటూ నిలదీశారు. ప్రజల ఆశీర్వాదంతో తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పడబోతోందని, అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేయడమే కాకుండా గోదావరి జలాలు తెచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

14 మంది ఎమ్మెల్యేలను ఇస్తే ఏం చేశారు..?

ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే సీఎం జగన్ ఒక్క ప్రాజెక్టునైనా కట్టారా.. ఒక్క పరిశ్రమనైనా తెచ్చాడా అని నిలదీశారు. యువతకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చాడా అని ప్రశ్నించడంతో జనం లేదు.. లేదు అంటూ కేరింతలు పెట్టారు. జాబు రావాలంటే.. బాబు రావాలంటూ జనం ఉత్సాహంతో నినదించారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారా.. అవును అంటూ గట్టిగా కేరింతలు కొట్టారు. 'మీ ఉత్సాహం చూస్తుంటే.. రాబోయే ఎన్నికల్లో కర్నూలు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో మనమే గెలుస్తామని, అందులో ఏ మాత్రం సందేహం లేదని' చేసుకుందామని చంద్రబాబు సూచించారు. ఉద్యోగాల కోసం.. డ్రిప్ ఇరిగేషన్ కోసం.. సైకో జగన్ పాలన అంతం కోసం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అంటూ చంద్రబాబు ప్రసంగిస్తుంటే రా.. కదిలిరా అంటూ జనం పెద్ద ఎత్తున దిక్కులు పెక్కటిల్లలా నినదించారు. రాతియుగం పోవాలి.. స్వర్ణ యుగం రావాలని చంద్రబాబు అంటే.. జగన్ పోవాలి.. టీడీపీ ప్రభుత్వం రావాలంటూ జనం కేరింతలు కొట్టారు.

ఓట్ల దొంగలున్నారు.. జాగ్రత్త

గెలుస్తామన్న ధీమా ఉండాలిగాని నిర్లక్ష్యం వద్దని చంద్రబాబు అన్నారు. ఓట్ల దొంగలున్నారని, ఆన్‌లైన్‌లోనే మార్చేస్తున్నారని. జాగ్రత్తగా ఉండాలంటూ కార్యకర్తలకు అధినేత సూచించారు. ఈ 73 రోజులు అప్రమత్తంగా ఉంటూ.. ప్రతిరోజూ ఓటు ఉందో లేదో తనిఖీ

అన్నారు. మరో పక్క పెరుగుతున్న నిత్యావసర ధరలు, పెంచిన కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలపై ఏకరువు పెట్టారు. చెత్తపై కూడా పన్నులు వేసిన చెత్త ప్రభుత్వమంటూ దుయ్యబట్టారు. ఈ సభలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, టీడీపీ జోన్-5 కోఆర్డినేటర్ బీద రవిచంద్రయాదవ్, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఆయా నియోజకవర్గం ఇన్‌చార్జీలు కేఈ శ్యాంబాబు, టీజీ భరత్, కోట్ల సుజాతమ్మ, కే.మీనాక్షినాయుడు, పి.తిక్కారెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆకేపోగు ప్రభాకర్, పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిలు రేఖాగౌడు, మల్లప్ప, సురేష్ తదితరులు ప్రసంగించారు. సమావేశంలో టీడీపీ నాయకులు బి.వీరభద్రగౌడు, వైకుంఠం మల్లికార్జున, పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, వైకుంఠం జ్యోతి, గుడిసె క్రిష్ణమ్మ, భాస్కర్ రెడ్డి, తెలుగు మహిళా అధ్యక్ష కార్యదర్శులు ముంతాజ్ భేగం, సుకన్యాదేవి, చంద్రదండు అధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.





చంద్రబాబును కలిసిన కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి



వేదికపై టీడీపీ నాయకులు



చంద్రబాబు రాక కోసం ఎదురు చూస్తున్న మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి



చంద్రబాబుకు గొర్రెపిల్ల బహూకరణ

పత్తికొండను ఎంతో అభివృద్ధి చేశాం : కేఈ కృష్ణమూర్తి

టీడీపీ ప్రభుత్వ హయాంలో పత్తికొండను తాము ఎంతో అభివృద్ధి చేశాం. మరో రెండు నెలల్లో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదు. నాలుగున్నరేళ్ల పాలనలో అవినీతి అక్రమాలు తప్ప జగన్ చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదు. సిద్ధమంటూ జగన్ ఇస్తున్న ప్రకటనలకు ప్రజలకు కూడా ఆయన్ను సాగనంపేందుకు సంసిద్ధంగా ఉన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే భవిష్యత్ : కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

పెండింగ్‌లో ఉన్న వేదవతి, గుండ్రేవుల, హంద్రీనీవా, ఆర్డీఎస్ వంటి ప్రాజెక్టులను పూర్తిచేస్తేనే జిల్లాకు భవిష్యత్ ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రాజెక్టులు పూర్తి కావాలంటే టీడీపీ ప్రభుత్వం వచ్చితీరాల్సిందే.

అవినీతి ఎమ్మెల్యేను సాగనంపుదాం : కేఈ శ్యాబాబు

అవినీతి అక్రమాలతో నియోజకవర్గాన్ని దోచుకుంటున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి వచ్చే ఎన్నికలలో ఓటుతో బుద్దిచెప్పి ఇంటికిసాగనంపుదాం. భూకబ్జాలు, దందాలు, ఇసుక, మద్యం మాఫియాతో అక్రమసంపాదన, ఉద్యోగాలపేరిట లంచాలు, కాంట్రాక్టర్లను బెదిరించి పర్సంటేజీలతో దోపిడీకి పాల్పడుతూ, ప్రజాసంక్షేమాన్ని అభివృద్ధిని ఎమ్మెల్యే మరిచారు.

చావుకెళ్లినా నవ్వడమేంటి?: కోట్ల సుజాతమ్మ

ఎవరైనా మృతులకు నివాళులర్పించేందుకు వెళ్తే బాధపడటం సహజం. కానీ సీఎం జగన్ మాత్రం విషాద కార్యాలు, చావులకు వెళ్తే నవ్వుతుంటాడు. నవ్వుతూ నివాళులర్పించే జగన్‌ను ఏమనుకోవాలి. ప్రజల బాధను చూసి నవ్వుకుంటున్న జగన్.. చివరకు నవ్వులపాలై ఓటమిని చూడడం ఖాయం.

వైసీపీ అంతం ఖాయం : మీనాక్షినాయుడు

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన వైసీపీ పాలన అంతానికి నేడు పత్తికొండలో జరిగిన 'రా..కదలిరా' కార్యక్రమం వేదిక నాందికావాలి. 72 ఏళ్ల వయసులో చంద్రబాబు నాయుడు చేపట్టిన ఈ కార్యక్రమంతో అధికార వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది.

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసిన జగన్ : తిక్కారెడ్డి

నాఎస్సీ, నాఎస్టీ, నాబీసీ అంటూ కల్లబొల్లి కబుర్లుచెప్పే జగన్ ఆ వర్గాలకు చేసింది శూన్యం. బడుగుల కార్పొరేషన్ల ద్వారా ఒక్కరూపాయి కూడా జగన్ ప్రభుత్వం రుణాలు ఇవ్వలేదు. చైర్మన్లుగా మారిన వైసీపీ నేతలకు జీతాలు ఇచ్చేందుకు తప్ప బీసీ కార్పొరేషన్లు ఎందుకూ పనిచేయడం లేదు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి : కేఈ ప్రభాకర్

అధికారం చేపట్టిన జగన్ అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా మార్చిన వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి వైసీపీని గద్దె దించడం ఖాయం.

అభివృద్ధి మరచిన జగన్ : ఆకెపోగు ప్రభాకర్

రాష్ట్రంలో అభివృద్ధిని సీఎం జగన్ మరిచాడు. అందుకే సిద్ధం అంటూ కొత్తగా పోస్టర్లతో నినాదం అందుకున్నాడు. ఆయన దృష్టిలో సిద్ధం అంటే జైలుకు వెళ్లడం ఏమో.

వైనాట్ 175 ఏమైంది : జయనాగేశ్వరరెడ్డి

వైనాట్ 175 అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీరాలు పలికాడు. 2024 ఎన్నికలు వచ్చేలోగా దేవుడు రాసిన స్క్రిప్టు జరుగుతుందని చెప్పాడు. ఇప్పుడు ఆ మాటలు ఏమైనట్లు జగన్. అవినీతి అక్రమాలకు ఏదో రోజు చరమగీతం పలకడం ఖాయం. జగన్ ప్రభుత్వానికి ఇక రోజుగులు గడిచిపోయాయి.

సమనయ్వంతో సాగితే విజయం మనదే

-సురేష్, జనసేన జిల్లా కన్వీనర్

వైసీపీ అరాచాకాలను అరికట్టేందుకు టీడీపీ, జనసేన పొత్తుతో ముందుకు సాగుతున్నాం. సమన్వయంతో ముందుకు సాగితే వచ్చే ఎన్నికల్లో విజయం మనదే. రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబునాయుడు చేపట్టిన 'రా..కదలి రా' కార్యక్రమం వైసీపీకి వెన్నులో వణుకుపుట్టిస్తోంది. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించి టీడీపీ, జనసేన అధికారం చేపట్టేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి.

ఎన్నికలపై మూడు రోజులపాటు శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 28: రాబోవు సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1న మూడు రోజుల పాటు ఎన్నికలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా.జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో జిల్లాలో ఎనిమిది నియోజవర్గాలకు సంబంధించి ఎంపిక చేసిన లెవెల్ మాస్టర్స్‌కు ఐటీ అప్లికేషన్స్‌పై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. 31న డీపీఆర్‌సీలో ఎంపిక చేసిన లెవెల్ మాస్టర్స్‌కు పోలింగ్ సరళిపై, ఫిబ్రవరి 1న బ్యాలెట్ సరళిపై ఇక్కడే శిక్షణ ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌గా డ్వామీ పీడీ సలీంబాషా, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి పి.దీప్తి, డ్వామీ ఏపీడీ జి.అలిపీరా, నిక్ అధికారి సి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మైనింగ్‌శాఖ డీడీ రాజశేఖర్ వ్యవహరించనున్నారు.

విద్యతోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలి

శ్రీకృష్ణదేవరాయ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు




శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసి రామచంద్ర ప్రభు తదితరులు

కర్నూలు(కల్చరల్), జనవరి 28: విద్యార్థులు చదువుతోపాటూ దేశభక్తిని కూడా అలవర్చుకోవాలని శ్రీకృష్ణదేవరాయ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో రాయల్ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) ఆధ్వర్యంలో బలిజకుల మెరిట్ విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తులసి రామచంద్ర ప్రభు హాజరై శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో రాణిస్తున్న విద్యార్థులకు 20 ఏళ్లుగా ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రూ.21 కోట్లు నిధులు తమ శ్రీకృష్ణదేవరాయ చారిటబుల్ ట్రస్టు నుంచి అందించామన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తరువాత సేవా గుణంతో మరొకరికి సాయం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం 123 మంది మెరిట్ బలిజ కుల విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోపా సభ్యులు, బలిజ సంఘం నాయకులు శెట్టి విజయకుమార్, కోనేటి చంద్రబాబు, కోనేటి వెంకటేశ్వర్లు, డాక్టర్ వై. సత్యనారాయణ, డాక్టర్ కుల్లాయప్ప, పత్తి ఓబులయ్య, డాక్టర్ కొట్టె చెన్నయ్య, రాజారామ్, దంతల రమణ, జి.శ్రీనివాస్, మల్లికార్జున మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.25 లక్షల విరాళం

శ్రీశైలం, జనవరి 28: శ్రీశైలం దేవస్థానం భక్తులకు నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం సికింద్రాబాద్ రాణి కన్‌స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన గల్లా గుండయ్య అనే భక్తుడు రూ.25లక్షల విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.వెంకటేష్, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ఈఓకు విరాళం చెక్కును అందజేస్తున్న దాత

షర్మిల రాకతో కాంగ్రెస్‌లో జోష్

నేడు నంద్యాల, కర్నూలు శ్రేణులతో సమావేశం



కర్నూలు(అర్బన్), జనవరి 28: షర్మిల రాకతో కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. వైసీపీలో అసంతృప్తులు చెలరేగుతున్న సమయాన రాష్ట్రంలో కాంగ్రెస్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఇదే సరైన సమయమని భావిస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి నంద్యాల, కర్నూలు జిల్లాలకు సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమ వారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకు తనిష్క ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సమావేశాన్ని కేంద్రంగా చేసుకొని కర్నూలు జిల్లాలో వైసీపీ అసంతృప్తులకు గాలం వేసి దిశగా అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల వైసీపీలో సీట్ల సర్దుబాటు ప్రక్రియలో తనకు ప్రాధాన్యత లేకపోవడంతో ఓ మంత్రి అజ్ఞాతంలోకి వెళ్లారని, కర్ణాటక వేదికగా కాంగ్రెస్ పెద్దలతో మంత నాలు జరుపుతున్నారనే ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. మరి కొందరు వైసీపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో షర్మిల సమావేశం చర్చనీయాంశంమైంది. ప్రచారానికి తగ్గట్టుగానే ఎందరో సిద్ధంగా ఉన్నారని ఫిబ్రవరి రెండో వారంలో పార్టీలో కీలక నాయ కులు చేరబోతున్నారంటూ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి చెప్పడం చర్చనీయాంశమైంది.

సమావేశం సాగబోతోంది ఇలా..

రెండు జిల్లాల్లో పార్టీ స్థితిగతులను తెలుసుకోవడంతోపాటు పార్టీ పునర్నిర్మాణానికి సంబంధించిన దిశానిర్దేశం చేస్తారు. సమావేశంలో ఆమెతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యాల రావు ఠాగూర్, పీసీసీ మాజీ అధ్యక్షులు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘు వీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, ముఖ్య నేతలు తులసీరెడ్డి, మస్తాన్‌వలి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్ తదితరులు పాల్గొంటారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరి, పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కర్నూలుకు వస్తున్న నేపథ్యంలో వీలైనంత మంది కార్యకర్తలను సమావేశానికి రప్పించాలని నేతలు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగా రెండు జిల్లాల పరిధిలో కార్యకర్తలు, పార్టీ అభిమానులను గుర్తించి వ్యక్తిగతంగా ఆహ్వానం పంపినట్లు సమాచారం. మధ్యాహ్నం నంద్యాల చెక్ పోస్టు నుంచి బీ క్యాంప్, రాజ్‌విహార్, ఆనంద్ టాకీస్, ఇందిరాగాంధీ నగర్, సీతారాం నగర్, వెంకట రమణ కాలనీ మీదుగా తనిష్క ఫంక్షన్ హాలు వరకు ర్యాలీగా చేరుకొని అక్కడ సమావేశం అవుతారు.

ప్రజా కోర్టులో జగన్‌రెడ్డికి శిక్ష తప్పదు

గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి



కల్లూరు, జనవరి 28: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న సీఎం జగన్‌రెడ్డికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తమ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. జగన్ ప్రభుత్వానికి మిగిలింది 74 రోజులు మాత్రమే అన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు సిద్ధం అంటున్న జగన్‌రెడ్డిని ఓడించేందుకు రాష్ట్ర ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ బాధితులే టీడీపీకి స్టార్ క్యాంపెయినర్లు అని, ఇసుక కొరతతో రోడ్డున పడ్డ కార్మికరంగం కూలీలే టీడీపీకి స్టార్ క్యాంపెయినర్లు అన్నారు. టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు కష్టపడి జగన్‌ను ఇంటికి సాగనంపాలని వారు పిలుపునిచ్చారు.

అశోక్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు, జనవరి 28: నగరంలోని అశోక్‌నగర్‌లో ఆదివారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. పద్మావతి అనే వృద్ధురాలి మెడ నుంచి గుర్తు తెలియని దుండగులు బంగారు గొలుసును లాక్కెళ్లారు. అశోక్‌నగర్‌కు చెందిన పద్మావతి తన ఇంటి ఎదుట నడుచుకుంటూ వెళ్తుండగా పల్సర్ బైక్‌పై ఇద్దరు యువకులు వచ్చారు. కాస్త దూరంలో బైక్‌ను ఆపి ఓ యువకుడు పద్మావతి వద్దకు వచ్చి రెసిడెన్షియల్ స్కూల్ ఎక్కడా? అంటూ అడిగాడు. తనకు తెలియదని సమాధానం ఇచ్చి వెళ్తుండగా ఆమె మెడలో నుంచి గొలుసును ఆ యువకుడు లాక్కెళ్లాడు. అప్పటికే సిద్ధంగా ఉన్న పల్సర్ బైక్ ఎక్కి పరారయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. అపహరణకు గురైన గొలుసు విలువ ఐదు తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 28: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫీజు గడువును ఈ నెల 29న సోమవారం వరకు పొడిగించినట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆదివారం తెలిపారు. తాత్కా లిక ఫీజు రూ.550, అపరాధ రుసుం రూ.3వేలతో కలిపి సోమవారం సాయం త్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఇంకా పరీక్ష ఫీజు చెల్లించ కుండా మిగిలివున్న విద్యార్థులకు సమాచారం ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాళ్లను ఆర్ఐవో ఆదేశించారు.

కొత్త సీఐలకు జిల్లాలు కేటాయింపు

కర్నూలు, జనవరి 28: ఇటీవలే సీఐలుగా పదోన్నతి పొందిన 47 మంది సీఐలకు జిల్లాలు కేటాయించారు. కర్నూలు జిల్లాకు 8 మందిని, నంద్యాల జిల్లాకు ఐదుగురిని, కడప జిల్లాకు 9 మందిని, అనంతపురం జిల్లాకు 15 మందిని, అన్నమయ్య జిల్లాకు మరో ఐదుగురిని కేటాయించారు. కాగా మిగిలిన వారికి ఇంకా జిల్లాలు కేటాయించలేదు.

అనుచిత పోస్టులు పెట్టిన మైనర్ అరెస్టు

కర్నూలు, జనవరి 28: ఇటీవల సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన ఓ మైనర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పది రోజుల కింద పాతబస్తీకి చెందిన మైనర్ సోషల్ మీడియాలో అనుచిత పోస్టు చేశారు. ఇది వైరల్‌గా మారడంతో అప్రమత్తమైన పోలీసులు అతడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

కదిలిన తెలుగు తమ్ముళ్లు

- జెండా ఊపి ర్యాలీలను ప్రారంభించిన నాయకులు
- పత్తికొండ సభకు భారీగా తరలిన కార్యకర్తలు

కర్నూలు(అర్బన్), జనవరి 28: పత్తికొండలో జరిగిన రా..కదలిరా సభకు టీడీపీ శ్రేణులు తరలి వెళ్లారు. ఆదివారం ఎస్టీబీసీ కళాశాల మైదానం నుంచి బస్సులు, కారులు, జీపులు, ఆటోల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. వాహనాలను కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ జెండా ఊపి ప్రారంభించారు. పరిశీలకులు శ్రీనివాస మూర్తి, కార్పొరేటర్ పరమేష్, నాయకులు జనసేన నాయకులు అర్షద్, అబ్బాస్, సుంకన్న, పార్లమెంట్ మహిళా అధ్యక్షు రాలు ముంతాజ్, మారుతి శర్మ, రామాంజనేయులు, మన్సూర్ అలీఖాన్ పాల్గొన్నారు

కర్నూలు(రూరల్): పత్తికొండలో జరిగిన రా..కదలిరా సభకు టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి కోడుమూరు నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో జనాన్ని తరలించారు. ఆదివారం కర్నూలులోని నెహ్రూనగర్‌లో వందలాది వాహనాలతో ఏర్పాటు చేసిన భారీ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో టీడీపీ గెలుపు చారిత్రక అవసరమన్నారు. రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న విధ్వంస పాలనపై అన్ని వర్గాల ప్రజల నుంచి తిరుగుబాటు మొదలైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు బొగ్గుల దస్తగిరి, సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జయన్న, సర్పంచు మాధవస్వామి, ఎంపీటీసీలు కురువ నాగరాజు, మద్దిలేటి, సూది రెడ్డిపల్లె శ్రీనివాసులు పాల్గొన్నారు.


సి.బెళగల్‌లో..

కోడుమూరు(రూరల్): చంద్రబాబు పత్తికొండ పర్యటనకు విచ్చేసిన నేపథ్యంలో ఆదివారం వివిధ గ్రామాల నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున బయల్దేరి వెళ్లారు. మండలంలోని లద్దగిరి, గోరంట్ల, అమడగుంట్ల, అనుగొండ, వెంకటగిరి, ఎర్రదొడ్డి, క్రిష్ణాపురం, పులకుర్తి, ప్యాలకుర్తి గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వాహనాలలో బయలుదేరారు. కార్యక్రమంలో అమడగుంట్ల సర్పంచ్ వరలక్ష్మీ, నాయకులు డీలర్ ప్రకాష్‌రెడ్డి, తిరుమలనాయుడు, పరమేశ్వరనాయుడు, తులసీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పడిగె సురేష్, రవికిషోర్, అమీన్, ఉగాది వెంకటేశ్వర్లు, రాఘవేంద్రయాదవ్, రంగన్న యాదవ్, అంజన్‌రెడ్డి, రవికుమార్, నారాయణ, సురేంద్ర పాల్గొన్నారు.

● పత్తికొండలో నిర్వహించిన చంద్రబాబు రా కదలిరా సభకు పలు గ్రామాల నుంచి విష్ణుసేన నాయకులు వాహనాలలో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో పట్టె క్రిష్ణ, పట్టె మధు, త్రివేద్‌కుమార్, రఘుపతి, ఉరుకుందు, ఈశ్వరప్ప, జొల్లు రాముడు, బీకే క్రిష్ణ, మేకల శంకర్, ముల్లా యూసుఫ్, నాగరాజు, మీనిగ వెంకటేశ్ పాల్గొన్నారు.

సి.బెళగల్: పత్తికొండలో టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు నిర్వహించిన రా కదలిరా కార్యక్రమానికి మండలంలోని కంబంధహల్, పోలకల్లు, తిమ్మన్నదొడ్డి, చింతమానుపల్లె, సంగాల, పలుకుదొడ్డి, కొండాపురం, ముడు మాల, ఈర్లదిన్నె, శింగవరం తదితర గ్రామాల నుంచి టీడీపీ నాయకులు తరలివెళ్లారు. వీరిలో మండల టీడీపీ కన్వీనర్ గోవిందుగౌడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ ఎంపీటీసీ ధనంజయుడు, సర్పంచ్ మాదమ్మ, మాజీ జడ్పీటీసీలు మునెప్ప, చంద్రశేఖర్, మాజీ ఎంపీపీలు నాగమణెమ్మ, దేవరాజు, మాజీ మండల కన్వీనర్ పాండురంగన్న ఉన్నారు.

గూడూరు: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. ఆదివారం టీడీపీ శ్రేణులు గూడూరు నుంచి పతికొండకు తరలివెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడుమూరు షాషావలి, సృజన్, శ్రీనివాసులు, పౌలు, విజయ్, గౌండ కుమార్, చాంద్ బాషా, నరసింహులు, మధు, విష్ణు సేన సభ్యులు పాల్గొన్నారు.

● రానున్న ఎన్నికల్లో కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగరడం ఖాయమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. ఆదివారం గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో గూడూరు నుంచి పత్తికొండకు టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకుడు పెరుగు పురుషోత్తం రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఎల్ సుధాకర్ రెడ్డి, దండు సుందరరాజు, నాగప్ప యాదవ్, మన్సూన్‌బాషా, మండల తెలుగు యుత అధ్యక్షుడు సుమన్ బాబు, రహిమాన్, సులేమాన్, గిడ్డయ్య, చిలక శ్రీను, కృష్ణ, కళ్యాణ్ రఘు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి


చంద్రబాబు సభకు తరలివెళ్తున్న గోరంట్ల నాయకులు


గూడూరులో..

వ్యాయామం లేక పెరుగుతున్న జబ్బులు

టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్


మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 28: వ్యాయామం లేకపోవడం వల్లే జబ్బులు పెరుగుతున్నాయని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని సిటీస్క్వేర్ మాల్ నుంచి అవుట్ డోర్ స్టేడియం వరకు టీజీవీ అనంత స్క్వేర్ మాల్. స్పార్టన్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కరోనా విజృంభించినా తర్వాత గుండె జబ్బులు పెరిగిపోయాయని అన్నారు. అనంతరం పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. లక్కీడిప్ ద్వారా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్, గుండె వైద్యనిపుణుడు లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.

● నరంలోని 5వ వార్డులో ఆదివారం నిర్వహించిన ముస్లిం ఆత్మీయ సదస్సుకు టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ హాజరై మాట్లాడారు. నగరంలోని ముస్లింలు టీడీపీకి మద్దతు ఇస్తున్నారని, రానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరుగుతుందని అన్నారు. టీడీపీ హయంలో ఉర్దూ యూనివర్సిటీ మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నా ఉద్దేశంతో ఇండస్ట్రీ యల్ జోన్ తెచ్చి విమానాశ్రయం ఏర్పాటు చేసినా ఘనత చంద్ర బాబుకు దక్కుతుందన్నారు. కార్య క్రమంలో టీడీపీ నగర ఇన్‌చార్జి నాగరాజు యాదవ్, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, చెన్నారెడ్డి, బాలు, ఎజాజ్, రాజేష్, హిదాయత్, లలితమ్మ, ఇంద్రజ, నగరాజు, షఫి, భాస్కర్ పాల్గొన్నారు.


2కే రన్‌లో పాల్గొన్న టీజీ భరత్

చలో విజయవాడను జయప్రదం చేయండి


పోస్టరును విడుదల చేస్తున్న మహిళలు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 28: రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతుందని, దానిని అరికట్టేందుకు మద్యంపై యుద్ధం నినాదంతో ఈనెల 31న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో చలో విజయవాడకు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా గిడ్డమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం ఏరులై ప్రవహిస్తుంద న్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి జగన్‌మోహన్‌రెడ్డి ఓట్లు వేయించుకున్నారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంత బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. నాలుగున్న సంవత్సర కాలంలో మద్యానికిబానిసలై చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(అర్బన్), జనవరి 28: ఫిబ్రవరి 1న నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి కోరారు. సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో అమర్ రాజా బ్యాటరీస్, అపోలో ఫార్మసీ, బైజూస్, ఇరుకో ఫ్యాబ్రిస్, పేటీఎం, ఫ్యుషన్ మైక్రో ఫైనాన్స్ ఎల్ అండ్ టీ, శ్రీరామ్ చిట్స్, అస్ట్రో స్టీల్స్ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, ఎంబీఏ, బిటెక్ చదివిన అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ. 10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. వివరాలకు 8374231357, 8309283980 కు సంప్రదించాలని సూచించారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కల్లూరు, జనవరి 28: వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చుతామన్న రాజకీయ పార్టీల హామీలను అమలు చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మక్కల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నగరంలోని నాగేంద్రనగర్ వడ్డెర సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి డా.బండారు రామకృష్ణ, యుపి.మల్లయ్య డి.పుల్లయ్య వి.వెంకటేశ్వర్లు హాజరై నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.సంజీవరాయుడు, శ్రీనివాసులు, సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

కర్నూలులో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 28: ఫిబ్రవరి 10, 11, 12 తేదీల్లో 14వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా హాకీ పోటీలను కర్నూలులో నిర్వహిస్తున్నట్లు హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ తెలిపారు. ఆదివారం మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ పోటీలకు 16 జిల్లాల జట్లు పాల్గొంటాయని, లీగ్ కం నాకౌట్ పద్ధతుల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.ప్రవీణ్, ట్రెజరర్ వీరేష్, సభ్యులు అరుణ్, రవికుమార్, మహేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

కర్నూలు(కల్చరల్), జనవరి 28: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాతబస్టాండు సమీపంలోని శ్రీశైల సత్రంలో శివభక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని శివభక్తులకు ఆయన అన్నం వడ్డించారు. అన్నదానం చేసిన వెంకటస్వామి గౌడ్, నాగరాజు, రవి గౌడ్, గురుస్వామి, గోవిందరాజులను ఆయన అభినందించారు.

మహిళ ఆత్మహత్య

కర్నూలు, జనవరి 28: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కింగ్ మార్కెట్‌కు చెందిన తెలుగు రేణుక అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త ఇటీవల మృతి చెందాడు. మూడు రోజుల కింద తుంగభద్ర నదికి వెళ్లి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం శవమై కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని నదిలో నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కొడుకు జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కుమార్ తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

గూడూరు, జనవరి 28: గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరికి గాయాలైనట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి.. ఆదివారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మునగాల రహదారిలో వెళ్తున్న ఆటో ప్రమా దవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యువరాజు అనే వ్యక్తికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు.

సర్పంచుల డిమాండ్లు పరిష్కరించాలి


మాట్లాడుతున్న బిర్రు ప్రతాప్‌రెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 28: సర్పంచుల 16 డిమాండ్లను పరిష్కరిం చాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం చాంబర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చాంబర్, సర్పం చుల సంఘం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు సర్పంచుల డిమాండ్లను పరిష్క రించాలని కోరుతూ ఈనెల 30న గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో చేపడుతున్న నిరసన దీక్షలను జయప్రదం చేయాలని పిలుపుని చ్చారు. దీక్షలు రాజకీయాలకు అతీతంగా సర్పంచులు, ఎంపిటీసీలు నిరాహార దీక్షలో భాగస్వాములు కావాలన్నారు. ఈసమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షు డు కే.శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి వై.రామచంద్రుడు, ఉపాధ్యక్షురాలు భాగ్యరత్న, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ అనుమతులు ఇవ్వాలి

- దేశ వ్యాప్తంగా వైద్యుల రక్షణ చట్టం తేవాలి
- చట్టాన్ని సవరించాలని సీఎంను కోరాం
- ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఫణిధర్

కర్నూలు(హాస్పిటల్), జనవరి 28: 25 పడకలు ఉన్న ప్రైవేటు ఆసుపత్రులకూ ఆరోగ్యశ్రీ గుర్తింపు అనుమతులు ఇవ్వాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణిధర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రవికృష్ణలు ప్రభుత్వాన్ని కోరారు. ఐఎంఏ స్టేట్ జోన్-3 వైద్యుల వర్క్‌షాపు కర్నూలులోని డాక్టర్స్ కాలనీలోని ఐఎంఏ కర్నూలు బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగింది. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాల ఐఎంఏ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది నవంబరు 8న సీఎం జగన్మోహన్ రెడ్డిని కలిసి ఐఎంఏ రాష్ట్ర కమిటీ వైద్యులపై జరుగుతున్న దాడులకు సంబంధించి చట్టాన్ని సవరించాలని విన్నవించిందన్నారు. అప్పుడు సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర స్థాయిలో వైద్యుల రక్షణ చట్టాన్ని దేశవ్యాప్తంగా తీసుకోవాలన్నారు. కొవిడ్ సమయంలో దేశ వ్యాప్తంగా 2వేల మంది, రాష్ట్ర వ్యాప్తంగా 184 మంది వైద్యులు మృతిచెందారని, దీనిపై ఐఎంఏ గాంధీ వర్ధంతి సందర్భంగా ఈ నెల 30న కొవిడ్ అమరవైద్యుల దినంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మందుల ధరలు అధికంగా ఉన్నాయనీ, వీటి ధరలను స్థిరీకరించి జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాలని, తద్వారా మందుల ఖర్చులను తగ్గించవచ్చన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు సుదీర్ఘకాలంగా ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎంఏ కర్నూలు బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌వీ రామ్మోహన్ రెడ్డి, కోశాధికారి రామచంద్రనాయుడు, ఫ్యామిలి బెనిఫిట్ స్కీం రాష్ట్ర చైర్మన్ బాలమద్దయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, ఐఎంఏ వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఫణిధర్

పుస్తకాలు భావితరాలకు అవసరం

కర్నూలు(కల్చరల్), జనవరి 28: చరిత్రను, సంస్కృతిని తెలియజేసే పుస్తకాలు భావితరాలకు అవసరమని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. ఆదివారం నగరంలోని పింగళి సూరన తెలుగు తోట సమావేశ హాలులో, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం), తెలుగు భాషా వికాస ఉద్యమం, సాహితీ సదస్సు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నరసం జిల్లా కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి రాసిన రసస్పందిని, మనలో మాట పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జి. పుల్లయ్య మాట్లాడుతూ ఆధునిక జీవితంలో పుస్తకాలు చదవే అలవాటు తగ్గుతోందని, కానీ యువత మన చరిత్ర, సంస్కృతికి ఆలవాలంగా నిలచే పుస్తకాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ వృత్తిపరంగా తెలుగు అధ్యాపకురాలిగా ఉంటూ భాషా సాహిత్యాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న రచయిత్రి దండెబోయిన పార్వతీదేవి అని, ఆమె రచనలు అన్ని వర్గాలకు ఆకట్టుకుంటాయని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ రసస్పందిని పుస్తకంలోని వ్యాసాల ద్వారా అనేక అంశాలను నేటి తరానికి పార్వతీదేవి అందించారన్నారు. బాలల కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ మాట్లాడుతూ మహనీయుల చరిత్రను గుర్తు చేస్తూ రాసిన వ్యాసాలు మెప్పిస్తాయని అన్నారు. ఈ సభలో రచయితలు గన్నమరాజు సాయిబాబా, జేఎస్ఆర్‌కే శర్మ, జి. రంగనాథ్, డాక్టర్ తొగట సురేష్‌బాబు, కా.వెం. సుబ్బలక్ష్మమ్మ, రంగస్థల కళాకారుడు గుర్రపుశాల అంకయ్య ప్రసంగించారు. సభలో డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, ఎం. లక్ష్మయ్య దంపతులను సాహితీవేత్తలు ఘనంగా సత్కరించారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జి.పుల్లయ్య, పత్తి ఓబులయ్య

షర్మిల పర్యటనను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న మస్తాన్ వలి

కర్నూలు(అర్బన్), జనవరి 28: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారని, దాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ కే. బాబురావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీతో వైసీపీకి ఉన్న బంధాన్ని బట్టబయలు చేస్తే ఆ పార్టీ నాయకులు తట్టుకోలేక పోతు న్నారన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని మోదీ దగ్గర జగన్ తాకట్టు పెట్టారని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ధ్వజమెత్తారు. సోమవారం కర్నూలు నగరంలోని తనిష్క ఫంక్షన్ హాలులో మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు, నంద్యాల జిల్లాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

16న భారత్ బంద్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 28: ఫిబ్రవరి 16న భారత్ బంద్‌కు సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో జిల్లా అధ్యక్షుడు పీఎస్. రాధాక్రిష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త ఆందోళనలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకుల రామాంజ నేయులు, ఎం.గోపాల్, సీహెచ్. సాయిబాబా, పి.నిర్మల, విజయ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● నగరంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ 29న సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీసు ముందు ధర్నా చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి టి.రాముడు సంయుక్తంగా ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

● నగరంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ న్యూసిటీ కార్యదర్శి హుస్సేన్ డిమాండ్ చేశారు. సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్న వాటిని అరికట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. నగర ఉపాధ్యక్షుడు విజయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

'అక్షరం-2024 పురస్కార' ప్రదానోత్సవం


కవి ప్రసేన్‌ను సత్కరిస్తున్న కాశీభట్ల వేణుగోపాల్

కర్నూలు(కల్చరల్), జనవరి 28: కర్నూలుకు చెందిన ప్రముఖ కవి కాశీభట్ల వేణుగోపాల్ స్థాపించిన అక్షరం లిటరరీ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం 'అక్షరం సాహిత్య పురస్కారం- 2024' ను ప్రముఖ కవి ప్రసేన్‌కు అందజేశారు. నగరంలోని ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి కథా రచయిత మారుతీ పౌరోహితం అధ్యక్షత వహించగా, అక్షరం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కాశీభట్ల వేణుగోపాల్, కవి ప్రసేన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఉమానాథరావు, డాక్టర్ క్రిష్ణమోహన్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, విరసం నాయకుడు నాగేశ్వరాచారి, కవి వెంకటకృష్ణ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ ప్రసేన్ కవిగా, విమర్శకుడిగా అనేక ప్రయోగాలు చేశారని, కవిత్వరూపం విషయంలో ఆయన వందేళ్లు ముందుంటారని ప్రశంసించారు. కవులు, రచయితలు, సాహితీవేత్తలు 'అక్షరం-2024 పురస్కారం' కవి ప్రసేన్‌కు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కథా రచయితలు డాక్టర్ ఎం. ప్రగతి, కల్యాణ దుర్గం స్వర్ణలత, టి.వెంకటేష్, ఇనాయతుల్లా, స్వయంప్రభ, సీఐ శ్రీనాథ్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ఏవీ రెడ్డి పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరిన సమ్మె


సమ్మె చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 28: తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ సెర్ప్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరింది. గత 23 సంవత్సరాలు సేవలకు గుర్తింపుగా క్రమబద్ధీకరించాలని, పే స్కేలు అమలు చేయాలని సెర్ప్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. కృష్ణుడు, రెహమన్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్.గోకారి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 28: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు చెల్లించకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెబుతా మని హెచ్చరించారు. 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే మంజూరు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు, కార్మికులకు సంబంధించిన పెండింగ్ రుణాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ సీపీఎస్‌ను రద్దు చేయకపోగా.. దాని స్థానంలో జీపీఎస్‌ను తీసుకురావడం పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రాథమిక విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసి జీవో.117ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు శ్రీధర్, గోవిందు, శేఖర్, మహమ్మద్ షఫీ, సుధాకర్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం


క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేస్తున్న టీడీపీ నాయకుడు జీఎండీ లతీఫ్

కర్నూలు(కల్చరల్), జనవరి 28: టీజీవీ అండ్ టీజీబీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న తైక్వాండో క్రీడాకారులకు బెల్టుల ప్రదానం చేశారు. ఆదివారం పెద్దమార్కెట్ సమీపంలోని పార్క్ మైదానంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, 2వ వార్డు కార్పొరేటర్ జీఎండీ లతీఫ్ ముఖ్య అతిథిగా హాజరై వివిధ అంశాల్లో రాణిస్తున్న విద్యార్థులకు బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ టి. వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగు నీరు


ఇనగండ్లలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

సి.బెళగల్, జనవరి 28: మండలంలోని ఇనగండ్ల గ్రామంలో రోడ్లపైనే మురుగు నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నీటిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మురుగు నీటి దుర్వాసనకు భరించలేకపోతున్నామని, దీంతో తాము రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో మురుగు కాలువలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



హొళగుంద నుంచి కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో పత్తికొండకు వెళ్తున్న టీడీపీ నాయకులు



హొళగుంద నుంచి ఈడిగ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో పత్తికొండకు వెళ్తున్న టీడీపీ నాయకులు



గోనెగండ్ల నుంచి..

కదిలిన తెలుగు తమ్ముళ్లు

● జెండా ఊపి ర్యాలీలను ప్రారంభించిన నాయకులు ● పత్తికొండ సభకు భారీగా తరలిన జనాలు

రా... కదలిరా... భారీ బహిరంగ సభకు జనాలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. నాయకులు, కార్యకర్తలు ఆయా నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి పత్తికొండ సభకు బయలుదేరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం కొనసాగుతోందని, చంద్రబాబు దెబ్బకు వైసీపీ ప్రభుత్వం భూస్థాపితం కావడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.



ఆదోనిలో బహిరంగ సభకు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

పెద్దఎత్తున చంద్రబాబు సభకు..

ఆదోని, జనవరి 28 : ఆదోని మండలంలోని సాదాపురం పంచాయతీ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల దగ్గర 20 వేల మంది తెలుగుదేశం కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు భోజన ఏర్పాట్లను చేశారు. వేలాదిగా కార్యకర్తలు అక్కడికి చేరుకున్న కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. దాదాపు వెయ్యి వాహనాలతోపాటు, వందలాది బైకుల్లో పత్తికొండ చంద్రబాబు భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు. తెలుగు తమ్ముళ్లకు భోజన ఏర్పాట్లను టీడీపీ సీనియర్ నాయకుడు రంగస్వామి నాయుడు, మారుతీ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి పరిశీలించారు. మీనాక్షినాయుడుతో పాటు తరలి వెళ్లిన వారిలో బత్తిన లక్ష్మీనారాయణ, అబ్బర్వర్లు గాజుల ఆదెన్న, జఫీవుల్లా, కుబేర్‌నాథ్ పాల్గొన్నారు.

హొళగుంద: పత్తికొండ సభకు ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ, వైకుంఠం మల్లికార్జున, ఈడిగ గోవింద గౌడ్ వర్గాలు వేర్వేరుగా నాయకులతో కలిసి తరలి వెళ్లారు. ఎల్లార్తి, సమ్మతగేరి, వందవాగలి, గజ్జెహళ్లి, కొగిలతోట, మర్లమాడికి, సులువాయి, లింగంపల్లి గ్రామాల నుంచి వందల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించి పత్తికొండకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తిప్పయ్య, ఎ. శేషగిరి, కాకి సీతయ్య, మైనార్టీ నాయకుడు ఆదాం, టీజే పంపాపతిరెడ్డి, వెంకటేష్, దిడ్డి నాగప్ప, దిడ్డి మల్లయ్య, దిడ్డి రామాంజి, ఈరప్ప, కోనేరు దుర్గయ్య, ఎర్రిస్వామి, వెంకటగిరి, మిక్కిలినేని అయ్యప్ప, గజ్జెహళ్లి సిద్దప్ప పాల్గొన్నారు.

రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం

ఆలూరు, జనవరి 28: రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం కనబడుతోందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీకి ప్రజలు పట్టం కడతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ మసాలా పద్మజ అన్నారు. ఆదివారం పత్తికొండలో జరిగిన 'రా...కదలి రా' బహిరంగ సభకు తన అనుచరులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున వాహనాల్లో తరలివెళ్లారు.

●ఆలూరు టీడీపీ కార్యాలయం నుంచి టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో భారీ ఎత్తున వాహనాల్లో తరలివెళ్లారు. ఆలూరు నియోజకవర్గం పరిశీలకులు నాగరాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

చంద్రబాబు సీఎం కావడం తథ్యం

రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు సీఎం కావడం ఖాయమని ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి అన్నారు. ఆదివారం పత్తికొండలో జరిగిన రా కదలిరా బహిరంగ సభకు భారీ ఎత్తున వాహనాల్లో తరలి వెళ్లారు. ముందుగా స్థానిక అంబేడ్కర్, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి డప్పులు, డీజే వాహనాలతో ర్యాలీ చేపట్టారు.

మంత్రాలయం: పత్తికొండలో జరిగిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సభకు మంత్రాలయం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తెలుగు యువ జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, జనసేన ఇన్‌చార్జి బీలక్ష్మన్న ఆధ్వర్యంలో మండల కన్వీనర్ వెంకటేశ్, ఎల్లారెడ్డి, వెంకటేశ్, కృష్ణమోహన్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి తదితరులు తరలివెళ్లారు. కోసిగి మండలం నుంచి జ్ఞానేష్, వక్రాణి వెంకటేశ్, భరద్వాజశెట్టి, తాయన్న, సోల్మాన్ రాజు, కౌతాళం నుంచి చెన్నబసప్ప, సాయిబాబా, అడివప్పగౌడు, కొట్రేష్‌గౌడు, పెద్దకడుబూరు నుంచి నరవ రమాకాంత్ రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, ఏసేబు ఆధ్వర్యంలో భారీగా వెళ్లారు. అదేవిధంగా మాధవరంలో టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఉలిగయ్య, పల్లెపాడు రామిరెడ్డి, ముత్తురెడ్డి, సురేష్ నాయుడు తదితరులు చంద్రబాబు సభకు తరలివెళ్లారు.

కోసిగి/గోనెగండ్ల/ కౌతాళం: పత్తికొండలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన 'రా..కదలి..రా' బహిరంగ సభకు కోసిగి, గోనెగండ్ల, కౌతాళం మండలాల నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కోసిగిలో వాహనాలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోనెగండ్ల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు రమేష్‌నాయుడు, రమేష్‌ఆచారి, మిన్నల్ల, నూర్‌హమ్మద్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రంగస్వామినాయుడు, రంగస్వామినాయుడు పాల్గొన్నారు.

మద్దికెర: పత్తికొండ పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం నిర్వహించిన 'రా..కదలిరా..' సభకు మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, మదనంతపురం తదితర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తంచౌదరి, రాజన్నయాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మదనంతపురం శ్రీనివాసులు, సంజప్ప ఆధ్వర్యంలో వెళ్లారు.

తుగ్గలి: టీడీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రా కదిలి రా కార్యక్రమానికి మండలం నుంచి పెద్దఎత్తున నాయకులు తరలి వెళ్లారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, సానుభూతిపరులు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో పత్తికొండకు చేరుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకటరెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, తిరుపాలునాయుడు, శ్రీరాములుచౌదరి, మనోహర్ చౌదరి, లక్ష్మణస్వామి, రవియాదవ్, వెంకటరాముడు చౌదరి, రాంపల్లి శీను తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ భూస్థాపితం కావడం ఖాయం : వీరభద్ర గౌడ్



ర్యాలీకి తరలి వెళ్తున్న మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, జనవరి 28 : చంద్రబాబు దెబ్బకు రాష్ట్రంలో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. ఆదివారం తన అనుచరులతో భారీ ఎత్తున ఆలూరులో ర్యాలీ నిర్వహించి భారీ ఎత్తున వాహనాల్లో పత్తికొండలో జరిగిన రా... కదలిరా... భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు.



కోసిగిలో వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న పాలకుర్తి శ్రీనివాసరెడ్డి



మంత్రాలయం నుంచి చంద్రబాబు సభకు తరలి వెళ్తున్న టీడీపీ నాయకులు



పత్తికొండకు తరలివెళ్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున



ఆలూరులో సభకు తరలి వెళ్తున్న ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి



జెండా ఊపి వాహనాలను తరలిస్తున్న ఆలూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు నాగరాజు



కౌతాళం నుంచి తరలివెళ్తున్న టీడీపీ నాయకులు



తుగ్గలి నుంచి...



నాగలిని చూపుతున్న చంద్రబాబు నాయుడు



భారీగా తరలి వచ్చిన నాయకులు



మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

టీడీపీలోకి భారీగా వలసలు



షాలేంకు పార్టీ కండువాకప్పి టీడీపీలోకి చేర్చుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, జనవరి 28: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీలోకి భారీగా వలసలు పెరుగుతున్నాయి. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఏడో వార్డునుంచి 150 దళిత కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనను నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్ హయాంలో దళితులపై దాడులు అధికమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షాలేం, మూర్తి, సునీల్, ఏమిలమ్మ, సురేష్, చిన్న, హనుమంతు, ఆంథోనమ్మ, భారతి పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు



కర్ణాటక బీజేపీ అధ్యక్షుడికి మెమొంటో అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 28: మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని కర్ణాటక రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బి.ఎస్.విజయేంద్ర ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ ముఖద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, బిందు మాధవ్‌లు ఘనం స్వాగతం పలికారు. ముందుగా మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన రాఘవేంద్రస్వామి బృందావనాన్ని దర్శించుకున్నారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి ఆశీర్వచనాలు అందుకున్నారు.

ప్రహ్లాదరాయల పల్లకోత్సవం : మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ప్రహ్లాదరాయల పల్లకోత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు.

రూ.2.10లక్షలు విరాళం : మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన బాలాజి అనే భక్తుడు రూ.లక్ష, వనజాక్షి రూ.10 వేలు, కర్నాటకలోని కొప్పల్‌కు చెందిన నాగరాజు అనే భక్తుడు రూ.లక్ష అన్న సమర్పణకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు తెలిపారు.

పాత పెన్షన్‌తోనే ఉద్యోగులకు భద్రత

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 28 : ఉద్యోగ ఉపాధ్యాయుల కుటుంబాలకు పాత పెన్షన్ విధానంతోనే భద్రత అని ఎస్టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ నాయుడు అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో రాకమునుపు సీఎం జగన్ మోహన్ రెడ్డి వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఐదేళ్లుగా సీపీఎస్ రద్దు చేయకపోగా జీపీఎస్ అంటూ మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు వీర చంద్ర యాదవ్, లోక్యా నాయక్, రవి, భీమ్ రాజు, ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎందుల బండి కింద పడి మహిళ మృతి

వెల్దుర్తి, జనవరి 28: ప్రమాదవశాత్తు ఎద్దుల బండి కింద పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని నరసాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బ్రహ్మయ్య భార్య గొల్ల రాములమ్మ (44) పొలం పనులు ముగించుకుని ఎద్దులబండిపై ఇంటికి రావాలని ప్రయత్నించింది. ఈ క్రమంలో ఎద్దులబండి ఎక్కుతుండగా ఎద్దులు బెదిరాయి. దీంతో రాములమ్మ ఎద్దులబండి చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం : వైద్యుడికి గాయాలు

ఆదోని రూరల్, జనవరి 28: అదుపు తప్పి ద్విచక్ర ప్రమాదానికి గురి కావడంతో ప్రభుత్వ వైద్యుడు ఆది నాగేష్ తీవ్రంగా గాయపడ్డాడు. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆది నాగేష్ ఆదివారం ఆదోని నుంచి ద్విచక్ర వాహనంలో పత్తికొండకు విధుల నిమిత్తం వెళ్తుండగా, ఆస్పరి మండల పరిధిలోని నగరూరు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ప్రమాదానికి గురైంది. తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆయన్ను స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఆస్పరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నీలకంఠేశ్వరుడికి వ్యాహోవళి మహోత్సవం

ఎమ్మిగనూరు, జనవరి 28: నీలకంఠేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు ఆదివారం స్వామి వారికి వ్యాహోవళి మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తేరుబజారులో ఉత్సవమూర్తి స్వామి వారిని ఊరేగింపుగా బసవన్న ఆలయం దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరిగి యథాస్థానానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్త ఎద్దులింటి మాచాని నీల మురళీధర్, కుటుంబ సభ్యులు మాచాని శివ శంకర్, భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నీలకంఠేశ్వరస్వామి జాతర సందడితో రహదారులన్నీ కిక్కిరిశాయి. ప్రధానం తేరుబజారులోని దుకాణాలు జనంతో నిండిపోయాయి. శ్రీనివాస సర్కిల్, సోమేశ్వర సర్కిల్, తేరుబజారు ప్రాంతం జనంతో రద్దీగా మారింది. ఈ సందర్భంగా చిన్నారుల ఆటవస్తువుల కొనుగోలుతో పాటు ఎగ్జిబిషన్ ప్రాంతం సందడిగా మా రింది.

అలరించిన ఎద్దుల పోటీలు

ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఆదివారం పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలు ఎద్దుల పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పాలపళ్ల సైజు విభాగంలో గుంటూరు జిల్లా కొండబాలవారి పాలెంకు చెందిన జీపీ చౌదరి బుల్స్ 5117.9 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. అలాగే గుంటూరుకు చెందిన శివపార్వతి, రామినేని పెదరత్తయ్య చౌదరికి చెందిన వృషభాలు 4964.5 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలవగా, కర్నూలు జిల్లా పంచలింగాలకు చెందిన భైరపోగు బుల్స్ 4801.4 అడుగులు లాగి తృతీయ స్థానంలోను, కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కలుగోట్ల రమేష్ నాయుడుకు చెందిన వృషభాలు 4745.7అడుగుల దూరాన్ని లాగి నాల్గోస్థానంలోను, పి.రుద్రవరంకు చెందిన గోపాల్ గౌడ్ వృషభాలు 4610.1అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. బండ లాగుడు పోటీల్లో గెలుపొందిన వృషబాల యజమానులకు నగదు బహుమతులను నిర్వాహకులు జగన్మోహన్ రెడ్డి, బసిరెడ్డి,సోగనూరు భీమిరెడ్డి, గాజుల కుమారస్వామిలు అందజేశారు. వ్యాఖ్యాతలుగా రామనాయుడు, కలామ్, సల్మాన్ పీఈటీ లక్ష్మన్న వ్యవహరించారు.



జాతరలో పసుపు కుంకుమను కొనుగోలు చేస్తున్న దృశ్యం



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు



వంట సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు



బండను లాగుతున్న రమ్మురి వృషభాలు

వైభవంగా కాశీంస్వామి ఉరుసు



పెండేకల్లులో కాశీంస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

తుగ్గలి, జనవరి 28: హిందూ ముస్లింలు ఐకమత్యంగా జరుపుకునే కాశీంస్వామి ఉరుసు వైభవంగా జరిగింది. ఆదివారం మండలంలోని పెండేకల్లులో కాశీంస్వామి ఉరుసు సందర్భంగా స్వామివారిని గుర్రంపై ఉంచి గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు దర్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి కానుకలను సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కారం భాస్కర్‌రెడ్డి, దర్గా ధర్మకర్త దివాకర్ రెడ్డి, అట్లా గోపాల్‌రెడ్డి, బసిరెడ్డి, సర్పంచ్ లీలావతి, మద్దిలేటి, గంగన్న, వీఆర్వో కాశీరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా రాతిదూలం పోటీలు

ఉరుసు సందర్భంగా రాతి దూలం పోటీలు నిర్వహించారు. పోటీలను టీడీపీ సీనియర్ నాయకులు కారం భాస్కర్‌రెడ్డి, తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున, సింగిల్‌విండో అధ్యక్షుడు అట్లా గోపాల్ రెడ్డి, అట్లా బసిరెడ్డి పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వృషభాలకు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదవ బహుమతులు రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లీలావతి, దివాకర్‌రెడ్డి, పెద్దరంగన్న, కాశీరంగన్న, నాయుడు పాల్గొన్నారు.